ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

- ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 28: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులను కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ బీఎస్ లత, వివిధ శాఖల అధికారులతో రహదారి భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. జిల్లాలో 2021 నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ, రోడ్డు సేఫ్టీ మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. డీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారి లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

జగిత్యాల/జగిత్యాల రూరల్, ఏప్రిల్ 28: జగిత్యాల రూరల్ మండలం పొలాస ప్రభుత్వ పాఠశాల 1991-92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జగిత్యాలలోని శివసాయి ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించారు. మొదట పహల్గాం మృతులతో పాటు మృతి చెందిన తోటి మిత్రుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు భాస్కర్ రావు, సుధాకర్, మనోహర్ రావు, కాళిదాస్, నాగ లక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం

కోరుట్ల, ఏప్రిల్ 28: పట్టణంలోని శివసాయి దవాఖానలో చికిత్స పొందుతున్న కసుల గంగుబాయికి సోమవారం శస్త్ర చికిత్స కోసం రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న కోరుట్ల సేవాదళ్ సభ్యులు జిల్లా ఉదయ్, భూతం భీమయ్య స్పందించారు. ఓ పాజిటివ్ రక్తాన్ని అందించి ప్రాణదాతలుగా నిలిచారు. రక్తదాతలను సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు, గంగుబాయి కుటుంబసభ్యులు, దవాఖాన సిబ్బంది అభినందించారు.

రిసోర్స్ పర్సన్ల ఎంపిక

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 28: వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయుల శిక్షణ కోసం జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాధికారి కే రాము సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, గణితం, ఆంగ్లం, ఫిజికల్ డైరెక్టర్ల విషయాల్లో ఎక్కువ దరఖాస్తులు రావడంతో వీరికి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డెమో, ఇంటర్వ్యూ ద్వారా అర్హత ఉన్న వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఫలితాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇక్కడ డైట్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ శంకర్, జిల్లా కో-ఆర్డినేటర్లు, తదితరులున్నారు.

ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలి

మేడిపల్లి: ధాన్యం కొనుగోళ్ల వివరాలు సీఈవో గోపిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

మేడిపల్లి, ఏప్రిల్ 28: తూకం వేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మేడిపల్లి మండలం కొండాపూర్, కాచారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతులకు చెల్లింపులు చేయాలన్నారు. ఇక్కడ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ వసంత, ఏవో షాహిద్‌అలీ, ఏపీఎం అశోక్, సీఈవో తొర్తి గోపి, తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

వెల్గటూర్/మేడిపల్లి, ఏప్రిల్ 28: భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్, మేడిపల్లి మండల కేంద్రంలో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవోలు పులి మధుసూదన్, జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్లు అనిల్, వసంత, ఎంపీడీవోలు నరేశ్, పద్మావతి, ఏవోలు మహేశ్, షాహిద్ అలీ, ఏఎంసీ చైర్మన్లు గుండాటి గోపిక-జితేందర్‌రెడ్డి, మాదం వినోద్‌కుమార్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

సారంగాపూర్, ఏప్రిల్ 28: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పులి మురళీ గౌడ్ ఆదివారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు మహేశ్ రెడ్డి, నాయకులు నాగభూషణం, లక్ష్మణ్, రమేశ్, సుధాకర్, హరీశ్, ప్రభాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐర్లాండ్‌లో బీఆర్ఎస్ రజతోత్సవం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు ఎనుగుర్తి కిరణ్

మెట్‌పల్లి, ఏప్రిల్ 28: ఐర్లాండ్‌లో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు ఎనుగుర్తి కిరణ్ ఆధ్వర్యంలో పార్టీ రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఫొటోతో ప్రత్యేకంగా తయారు చేసిన కేక్‌ను కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ముందంజలో నిలిపారని కిరణ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఉపాధ్యక్షుడు విశాల్ శిరాంశెట్టి, సలహాబోర్డు డైరెక్టర్ పవన్‌కుమార్, సభ్యులు అజయ్‌కుమార్ పొలంపల్లి, చిలివేరి నితీశ్, రామకృష్ణ, నవీన్‌కుమార్, అరుణ్, సాయి మనీశ్, తోట సీతారామాంజనేయులు, అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

నిరుపయోగంగా ఉన్న తూకం వేసే యంత్రం

భూషణరావుపేటలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- తూకం వేయాలని రైతుల వేడుకోలు

కథలాపూర్, ఏప్రిల్ 28: కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయినట్లు రైతులు సోమవారం తెలిపారు. ధాన్యం తూకం వేసే హమాలీలు నాలుగు రోజుల క్రితం వెళ్లిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని పేర్కొంటున్నారు. హమాలీలు లేకపోతే ఇతర గ్రామాల నుంచి తెప్పించి తూకం వేయించాల్సిన నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షానికి ధాన్యం తడిసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కోరుట్ల, ఏప్రిల్ 28: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మున్సిపల్ అనుబంధ గ్రామం ఏకీన్‌పూర్ ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి పట్టణంలోని తాళ్ల చెరువులోకి నీటిని మళ్లించేందుకు ఇసుక బస్తాలు అడ్డుగా వేసే పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ, పట్టణంలో ఎండా కాలంలో మంచినీటికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అయ్యప్పగుట్ట కాలనీలో ఉన్న ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తాళ్ల చెరువులోని నీటిని ఫిల్టర్ బెడ్‌లోకి మళ్లించి శుద్ధి చేసి అవసరమైనప్పుడు ప్రజా అవసరాలకు వినియోగించుకుంటామని తెలిపారు. ఇక్కడ మున్సిపల్ డీఈఈ సురేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఉన్నారు.

ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో నీళ్లకు అడ్డుగా ఇసుక బస్తాలు వేస్తున్న కార్మికులు

నేడు అవగాహన సదస్సు

పెగడపల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ హాజరవుతారని పేర్కొన్నారు. మండల రైతులు హాజరు కావాలని కోరారు.

చిన్నారిని చితకబాదిన తల్లి

- స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వెలుగు చూసిన ఘటన

బాబును అమ్మమ్మకు అప్పగిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకులు

జగిత్యాల, ఏప్రిల్ 28: భర్త మీద కోపంతో చిన్నారికి నరకం చూపించిందో తల్లి... బాబును ప్రతి రోజూ కిందపడేసి కొట్టడంతో స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌లో నివాసముండే రమకు ఆంజనేయులు అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆంజనేయులుకు గతంలో వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబంలో మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. ఈ విషయం చెప్పి రమను రెండో వివాహం చేసుకున్నాడు. రమ ఆరు నెలల గర్భిణి అయిన తర్వాత ఆంజనేయులు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. రమకు బాబు జన్మించగా, అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులే చూసుకుంటున్నారు. అయితే రెండేళ్ల తర్వాత ఆంజనేయులు స్వగ్రామానికి వచ్చినప్పటి నుంచి, మొదటి భార్యతో తిరిగి సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో రమ గొడవ పడుతుండేది. ఆంజనేయులు మూడు నెలల క్రితం తిరిగి దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో రమ మానసిక స్థితి సరిగ్గా ఉండడం లేదు. భర్తపై కోపంతో పాటు ఇంట్లో బాబు అల్లరి చేస్తున్నాడని అతడిని రోజూ కొట్టడంతో స్థానికులు గమనించి వీడియో తీసి, సోషల్ మీడియా, సఖీ అధికారులకు పంపారు. పిల్లల సంరక్షణాధికారికి సమాచారం ఇవ్వగా వారు వెళ్లి రమతో మాట్లాడారు. రమకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో తన పొరపాటు తెలుసుకొని ఇకపై బాబును కొట్టనని అధికారులకు హామీ ఇచ్చింది. పిల్లల సంరక్షణాధికారి బాబును రమ తల్లిదండ్రులకు అప్పగించారు. రమను సఖీ కేంద్రంలో ఉంచి కౌన్సెలింగ్ చేస్తున్నారు.

వరి కొయ్యకాలును కాల్చవద్దు

మేడిపల్లి, ఏప్రిల్ 28: వరి కొయ్యకాలును కాల్చవద్దని ఏవో షాహిద్ అలీ రైతులకు సూచించారు. మేడిపల్లి మండలం కొండాపూర్, విలాయతాబాద్ గ్రామాల్లోని వరి పొలాల్లో కాల్చిన కొయ్యకాలును ఏవో సోమవారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వరి కొయ్యకాలును కాల్చడం వల్ల పంటకు అవసరమయ్యే జీవరాశులు, నేల స్వభావం మారిపోతాయని తెలిపారు. పర్యావరణ కాలుష్యంతో పాటు అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గట్ల అశోక్, ఆర్ఐ రమేశ్, ఏఈవోలు సురేందర్‌నాయక్, మంజుల, రైతులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 28: వరి కొయ్యకాలును కాల్చవద్దని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాయుమలినం ఏర్పడడం, భూసారం తగ్గిపోవడం, పర్యావరణ సమతుల్యతకు హాని కలుగుతుందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

జగిత్యాల, ఏప్రిల్ 28: జగిత్యాల పట్టణంలోని 15వ వార్డు (శంకులపల్లి)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, అడువాల లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, బాల ముకుందం, తోట మల్లికార్జున్, మెప్మా ఏవో శ్రీనివాస్, ఏఈ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 28: జగిత్యాల పట్టణంతో పాటు రాయికల్ మండల పరిధిలో పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీసీఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని భవానీనగర్, రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైతాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 17,875తో పాటు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, కానిస్టేబుళ్లు రమేశ్, అఫ్రోజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి, ఏప్రిల్ 28: జిల్లాలో మే ఒకటిన నిర్వహించే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం కార్మిక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ, మే ఒకటిన కార్మిక దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో కార్మిక జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శనిగరపు ప్రవీణ్, రాచర్ల సురేశ్, గురిజాల శేఖర్, నిమ్మ గంగాధర్, బైర కమలాకర్, క్యాస శంకర్, ప్రకాశ్, మల్లయ్య, రాజేశం, రాజ్‌కుమార్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చిరువ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 28: రోడ్లపై చిరువ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన కూడల్లో రోడ్లపై పండ్ల వ్యాపారం చేస్తున్న వారికి అధికారులు జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెట్‌పల్లి డివిజన్‌లో వివిధ పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి రోజు వేల సంఖ్యలో ప్రజలు నగరానికి వస్తుంటారన్నారు. వ్యాపారులు రోడ్డు పైకి రావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రోడ్లపై ఇష్టం వచ్చినట్లు బండ్లు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నాయక్, మహిపాల్, లింబయ్య ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి, ఏప్రిల్ 28: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, మండల కేంద్రంలో సోమవారం టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్, నాయకులు కొత్తపల్లి అజయ్, ఎండీ సయ్యద్, చెక్కపల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, కానుగంటి శ్రీనివాస్, ఎండీ మక్బూల్, అరుణ్, కొత్తపల్లి కిరణ్, అడ్లగట్ట ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మెనలో బడిబాట కార్యక్రమం

కథలాపూర్, ఏప్రిల్ 28: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థుల ఇండ్లకు వెళ్లి కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. 20 మంది విద్యార్థులు పేరు నమోదు చేసుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మధుకర్, అంబటి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 28: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్ బిల్లుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి, మెమెంటో అందించారు. అలాగే, ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు కొండపలుకుల నర్సింగారావు, సంగెం జయను శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాదరావు, గడ్డం మైపాల్‌రెడ్డి, మేన్నేని నీలిమ, చెరకు మహేశ్వర శర్మ, భాగ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 28: యాదవులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. వెల్లుల్లలోని యాదవ సంఘ భవనంలో సోమవారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. 66 మందికి సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు తొట్ల చిన్నయ్య, అంకం శంకర్, గుండెల నగేశ్, లింబాద్రి, వెల్లుల్ల సంఘం సభ్యులు పాక నర్సయ్య, వేముల నర్సయ్య, అరుణ్, రామకృష్ణ, స్వామి, జలందర్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి

మల్లాపూర్, ఏప్రిల్ 28: మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్‌ను సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటేశ్‌కు ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ బ్యాడ్జీ పెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ఆక్రమించారని ఆందోళన

పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మల్లాపూర్, ఏప్రిల్ 28: మొగిలిపేటలోని ఎస్సీ కాలనీలో పబ్లిక్ రోడ్డును ఆక్రమించారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన దళిత మహిళా సంఘాల సభ్యులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నలభై ఏళ్లుగా ఈ రోడ్డుపై కాలనీ వాసులు నడుస్తున్నారని, కొంత మంది కబ్జా చేసి గోడ నిర్మించినట్లు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు స్థానిక పంచాయతీ అధికారులు, ప్రజావాణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయితి నాగరాజు, కల్లెడ గంగాధర్, గోపిడి ధనుంజయ్ రెడ్డి, వెలిచాల సత్యనారాయణ, మల్లేశ్‌యాదవ్, సత్తన్న, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 28: జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో నెల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షకులకు క్రీడా సామగ్రితో పాటు పారితోషికం కూడా జిల్లా యువజన క్రీడల శాఖ అందించనున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

జగిత్యాల: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీజీఈజేఏసీ నాయకులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 28: పహల్గాంలో హిందువులపై దాడి జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అదనపు కలెక్టర్ బీ ఎస్ లత పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్ ఎండీ వకీల్, ఏవో షాదబ్‌హకీమ్, తహసీల్దార్ కిషన్, డీఎస్సీడీవో రాజ్‌కుమార్, కోచైర్మన్లు చంద్రయ్య, ఏ శ్రీనివాస్, ఎన్నం రాంరెడ్డి, హరి అశోక్‌కుమార్, తుంగూరి సురేశ్, గంగనర్సయ్య, రాంచంద్రం, మహేశ్, కోకన్వీనర్లు యాళ్ల అమర్నాథ్‌రెడ్డి, వేణు, బైరం హరికిరణ్, నరేందర్, గోవర్ధన్, రవీందర్, సంతోష్, ఫైనాన్స్ కార్యదర్శి సాహెద్‌బాబు, జాయింట్ సెక్రటరీలు మహమూద్, రవీందర్, సుగుణాకర్, రాజేందర్, రాజేశం, విశ్వనాథం, రవికుమార్, సంపత్, యాకూబ్, నారాయణ, అరుణ, రాజేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లాపూర్, ఏప్రిల్ 28: పహల్గాం దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మండల కేంద్రంలోని మసీదు ఆవరణలో సోమవారం మండల ముస్లిం, మైనార్టీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఇక్కడ నాయకులు అబ్దుల్ రజాక్, బషీర్, తక్కియొద్దీన్, తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 28: రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ధరూర్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నేతలతో కలిసి గ్రామ శివారులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, శివకుమార్, మల్లేశం, నర్సయ్య, శంకర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 28: జగిత్యాలల